2CTR1:2CTR1.qxd 7/1/2026 11:47 PM Page 1





# భక్తి శ్రద్ధలతో...శివయ్య సన్నిధిలో మొకరిల్లిన లోకేష్

**భక్తులతో మమేకం... దర్శనాలపై వాకబు**

శ్రీకాళహస్తి,జూలై 1 ప్రభాతవార్త: రాష్ట్ర, విద్య, సాంకేతిక, ఎలక్ట్రానిక్‌శాఖా మంత్రి నారా లోకేష్ బుధవారం రాత్రి శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకున్నారు. ఆయన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి సారి ఆలయ దర్శనానికి రావడంతో స్థానిక శాసనసభ్యులు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేశారు. కట్టుదిట్టమైన రక్షణలో నారా లోకేష్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ వేదపండితులచే వేదమంత్రాలతో స్వాగతం పలికారు. మంత్రి రాగానే ఇఓ వెంకటేశులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. దక్షిణ గోపురం నుండి కంచుగడప వరకు లోకేష్ భక్తులను పలకరిస్తూ దర్శనాలు బాగా జరుగుతున్నాయా? ప్రసాదాలు అందుతున్నాయా? సంస్కరణలకు సంబంధించి వాకబు చేస్తూ ముందుకు వెళ్ళారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి వద్ద ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమాల్లో నారాలోకేష్‌తో పాటు వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ రామకృష్ణ, గంగాధరనెల్లూరు ఎంఎల్‌ఏ థామస్,దర్శి ఎంఎల్‌ఏ దామచర్ల సత్య, తుడా చైర్మెన్‌డాలర్ దివాకర్‌రెడ్డి,మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు,బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, గోపినాథ్ వున్నారు.



స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందుకుంటున్న మంత్రి నారా లోకేష్

తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ళ ప్రస్థానం | వార్త | వార్షికోత్సవం | 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# పరిశ్రమలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

**-స్పీడాఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకు వెళుతున్నాం -రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు**





హీరో మోటోకార్ప్ పార్ట్స్ సంస్థని ప్రారంభ అనంతరం మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, పాల్గొన్న మంత్రులు, జిల్లా అధికారులు, నాయకులు, పరిశ్రమ అధికారులు

తిరుపతి(లీగల్), జూలై 1 ప్రభాతవార్త: తిరుపతిజిల్లా సత్యవేడు నియోజకవర్గం మాధనపాళెంలో హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హీరోమోటో కార్ప్ చేపడుతున్న రూ.3.200 కోట్ల పెట్టుబడి ప్రణాళిక రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, హీరో వ్యవస్థాపక చైర్మన్ డా. బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్‌ని స్మరించుకున్నారు. ఆయన కేవలం పారిశ్రామికవేత్త మాత్రమే కాకుండా జాతి నిర్మాణానికి విశేషంగా తోడ్పడిన మహనీయుడని కొనియాడారు. ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకున్న హీరో సంస్థను ప్రత్యేకంగా చర్చించి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చామని తెలిపారు. 2018లో తిరుపతిలో శంకుస్థాపన చేసిన హీరో ప్లాంట్ ప్రస్తుతం పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తోందని, ఇప్పుడు విడా బ్రాండ్‌తో ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను తయారు చేయడం ఆనందంగా ఉందన్నారు. హీరోకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కేంద్రాల కంటే శ్రీసిటీలోని కేంద్రాన్ని అత్యంత పెద్దదిగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. హీరో మోటోకార్ప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. పవన్‌ముంజాల్ ప్రకటించిన రూ.3,200 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులను కూడా వేగంగా ప్రారంభించాలని కోరారు. భవిష్యత్ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలదేనని, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సూచిం చారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి విప్లవాత్మక చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు.గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడేవారమని, ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకోవడమే కాకుండా వాటి స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు, రైలు, జల, వాయు రవాణా ఉందని, వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు కూడా తగినంత నీరు అందించే సామర్థ్యం రాష్ట్రానికి ఉందన్నారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని, అమరావతి కోసం 29 వేల మంది రైతులు భూములు ఇచ్చి చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మరచిపోలేమన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే 100 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతోందని, మరికొన్ని డేటా సెంటర్లు కూడా రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, కడప స్టీల్ ప్లాంటు పనులు కూడా త్వరలో పునఃప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇటీవల జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌ని ప్రారంభించామని, రాష్ట్రంలో సమృద్ధిగా ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. హీరో మోటోకార్ప్ సంస్థ పీ-4 కార్యక్రమంలో భాగస్వామిగా ఉండి పేదలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా డాక్టర్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్ హీరోస్ ఆఫ్ టుమారో స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుపతి జిల్లాలో మహిళా పోలీసులకు ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు అందించేందుకు ముందుకు వచ్చిన హీరో మోటోకార్ప్ సంస్థకు సీఎం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, హీరో సంస్థలో 40 శాతం మంది ఉద్యోగులు మహిళలే కావడం గర్వకారణమన్నారు. పీ-4 విధానం ద్వారా సంపన్నులు పేదలకు అండగా నిలిచే వ్యవస్థను ఏర్పాటు చేశామని, సంపద సృష్టితో పాటు దాని ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో ముందుకు సాగుతున్నామని, డ్వాక్రా మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని తెలిపారు. పెద్ద కార్పొరేట్ సంస్థలు సైతం రుణాల చెల్లింపులో వెనుకబడినా, డ్వాక్రా మహిళలు మాత్రం క్రమంతప్పకుండా రుణాలు చెల్లించడం వారి క్రమశిక్షణకు నిదర్శనమన్నారు.

# సీఎం సభకు...అన్ని ఏర్పాట్లు పూర్తి

**-సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు -పోలీస్ నిఘా నీడలో సీఎం సభా ప్రాంగణం**



విబిజీ రామ్‌జీ పథకాన్ని ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, నాయకులు

ఓబులవారిపల్లి, జూలై 1 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విబిజి రాంజీ గ్రామీణ పథకాన్ని ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం, ముక్కువారిపల్లి రెవిన్యూ గ్రామంలో, మంగంపేట వద్ద గురువారం ఉదయం నుంచి సీఎం సభ కార్యక్రమం నిర్వహించ బడుతుందని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచ్చేసి విబిజి గ్రామీణ పథకాన్ని పేదల ఉపాధి కోసం లాంఛనంగా దేశానికి గర్వించదగ్గ పథకంగా అభివర్ణించి మొక్కవారిపల్లిలో ప్రాంగణంలో ప్రారంభించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని దేశ ప్రజల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు ఈ పథకం ముఖ్య ఉద్దేశం పేద ప్రజల జీవనోఉపాధి కోసం వంద రోజుల నుంచి 125 రోజులు పెంచడం జరిగిందని సమాచారం ఏది ఏమైనా ఈ కార్యక్రమానికి అతిరథ మహారథులు రాష్ట్రం నుంచి వివిధ మంత్రులు శాఖలకు సంబంధించి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అన్ని విధాలుగా ముక్కారూపా నందరెడ్డి మరియు ఆయన తనయుడు ముక్కాసాయి వికాస్ రెడ్డి ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మి మరియు కుటుంబ సభ్యులు కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభా ప్రాంగణంలో ప్రజలకు సంబంధించి అలాగే అధికారులకు సంబంధించి అన్ని ప్రజా అవసరాలకు సీఎం సభకు సర్వం సిద్ధం చేశారు. అంతేకాకుండా ఈ సభ ప్రాంగణాన్ని చూసిన ప్రతి ఒక్కరు హర్షం వ్యక్తం చేస్తూ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నందుకు ఒక్కరూపానందరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు కమిషనర్ కృష్ణ తేజ, ఎస్‌పి ఎల్.సుబ్బరాయుడు, డి.ఎస్.పి శ్రీనివాసరావు, పంచాయ తీరాజ్ అధికారులు రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు ఓబులవారిపల్లి ఎస్సై కుమార్, తహసిల్దార్ విద్దేశ్వరరావు, ఎంపీడీవో రాజేందర్, రామ్మో హన్‌రెడ్డి, ఇరిగేషన్, పంచాయతీరాజ్ డిఇ బాల నరసింహులు అన్ని శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. 1200 మంది పైచిలుకు పోలీస్ సిబ్బంది తో కట్టుదిడ్డమైన ఏర్పాట్లు, ఎక్కడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల రాయలు, రాజంపేట టిడిపి నాయకులు చెమ్మర్తి జగన్మోహన్ రాజు, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, గుత్తి నరసింహ శ్రీనివాసరాజు, ఖాదీ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి, అంతగాని నరసింహ ప్రసాద్, కస్తూరి విశ్వనాథ నాయుడు, గునపాటి కిరణ్ రాయల్, గునపాటి చెన్నారాయుడు, ఆనమలగుండం చంద్రమోహన్, గునిపాటి వేణుచరణ్ తల్లి వెంకటరమణారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సిగమాల మల్లికార్జునరెడ్డి, వాసుదేవరెడ్డి, చిన్నిరెడ్డి గోపాల్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర చైర్మన్ గడ్డం చెంగలరాజు టిడిపి నాయకులు, చంగల్‌రాజు పుల్లంపేట టిడిపి నాయకులు శ్రీనివాసులు రాజు, చంద్ర రాజుగజేంద్ర నాయుడు, పి.కోటేశ్వర్ నాయుడు, పుల్లగంటి చంద్రయ్య, పనింద్ర వెంకటేశు, బండి వెంకటరమణ, గబ్బిరాజ రెడ్డి, దొరబాబు, ఆచారి వెంకటేష్, హోలీ నరసారెడ్డి, సురేంద్ర, రవిరాజు, ప్రసాదు, జనసేన నాయకులు బిజెపి నాయకులు టిడిపి నాయకులు అధిక సంఖ్యలో అన్ని శాఖల అధికారులు పోలీసు బృందం పాల్గొన్నారు.









## ఆదిమూలానికి ముఖ్యమంత్రి పిలుపు

తిరుపతి(లీగల్), జూలై 1 ప్రభాతవార్త: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంతో ముఖ్యమంత్రి, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈ రాత్రి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. తిరుపతి జిల్లా మాధనపాళెంలో జరిగిన హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి ఆదిమూలంను ప్రత్యేకంగా పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. అనంతరం రాత్రి సమావేశానికి రావాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఈ భేటి రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి పనులు, పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జరుగుతున్న ఈ సమావేశంపై సత్యవేడు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి తిరుపతి జిల్లా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# వకుళమాత ఆలయంలో...రేపు అక్షరగోవిందం

**-రోజుకు 50మంది చిన్నారులకు అనుమతి**

తిరుమల,జులై 1ప్రభాతవార్తప్రతినిధి: హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా టిటిడి ఆధ్వర్యంలో వకుళామాత సన్నిధిలో 'శుక్రవారం" "అక్షర గోవిందం - అన్నప్రాశన" కార్యక్రమం మొదలుకానుంది. బుధవారం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులతో కలిసి టిటిడి జెఈఓ డాక్టర్ ఎ. శరత్ పరిశీలించారు. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో, వకుళామాత కరుణాకటాక్షాల మధ్య వేదోక్తంగా చిన్నారులకు అక్షరా భ్యాసం, అన్నప్రాశన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, పాల్గొనదలచిన వారు ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అక్షర గోవిందంలో పాల్గొనే ప్రతి చిన్నారికి ఉచితంగా "అక్షర గోవిందం" కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. జూలై 4 నుండి ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ప్రతిరోజూ రెండు బ్యాచ్‌లలో, ఒక్కో బ్యాచ్‌కు 25 మంది చొప్పున అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇఓ తదితరులు



